# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 07-09-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ అమరావతిలో ఇళ్ల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనను వేగవంతం చేస్తున్నామని మంత్రి పి.నారాయణ తెలిపారు.

- ❖ సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాలన్నింటినీ మూసివేశారు.

- ❖ పోలవరం ఎడమ కాలువ ద్వారా నవంబర్ నాటికి అనకాపల్లి వరకు గోదావరి జలాలు తీసుకొస్తామని మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి వెల్లడించారు.

- ❖ పీపీపీ విధానం ద్వారా కొత్తగా నిర్మించే వైద్య కళాశాలపై నియంత్రణ, యాజమాన్య హక్కు రాష్ట్ర ప్రభుత్వానిదేనని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.

==========================

భూసేకరణ కంటే భూసమీకరణ వలన రైతులకు ఎక్కువ లాభం కలుగుతుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి. నారాయణ తెలిపారు. రాజధాని పరిధిలోని నేలపాడులో గెజిటెడ్ అధికారుల ఇళ్ల నిర్మాణాలను మంత్రి ఈ రోజు పరిశీలించారు. పనుల పురోగతిపై సీఆర్‌డీఏ ఇంజినీర్లు, గుత్తేదారు సంస్థ ప్రతినిధులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఇళ్ల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గెజిటెడ్ అధికారులకు 14 టవర్స్‌లో 1,440 ఇళ్ల నిర్మాణం జరుగుతోందని తెలిపారు. డిసెంబర్ 31 లోగా అన్ని టవర్ల నిర్మాణం పూర్తి చేస్తామని, అమరావతిలో రోడ్లు, డ్రైయిన్ల పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రి తెలియజేశారు.

==========================

సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాలన్నింటినీ మూసివేశారు. మధ్యాహ్నం 3 గంటల 30 నిమిషాల నుండి 12 గంటల పాటు ఆలయం మూసివేయనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఒక ప్రకటనలో తెలిపింది. తిరుమలలో జరగాల్సిన పౌర్ణమి గరుడ సేవ, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను ఈరోజు రద్దు చేశారు. టిటిడికి సంబంధించిన స్థానిక ఆలయాన్నింటినీ మూసివేసినా తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తీశ్వర ఆలయాన్ని మాత్రం తెరిచే ఉంచనున్నారు. శ్రీకాళహస్తీశ్వరుడు గ్రహాలకు అతీతుడు కావడంతో ఆలయాన్ని తెరిచి ఉంచి, గ్రహణం సమయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నారు.

చంద్రగ్రహణం కారణంగా విశాఖలోని సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి ఆలయం మూసివేశారు. రేపు ఉదయం 8 గంటల నుండి భక్తులను స్వామి వారి దర్శనానికి అనుమతిస్తారు. శ్రీశైల మల్లన్న క్షేత్రంలో ఈ రోజు మధ్యాహ్నం 1 గంట నుంచి సోమవారం ఉదయం 5 గంటల వరకు ఆలయ ద్వారాలు మూసివేయనున్నారు. అదేవిధంగా పంచారామ క్షేత్రాలైన శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయం, అష్టభుజి ఆలయం, శ్రీ ఉమా సోమేశ్వర జనార్ధన స్వామి ఆలయాలను మూసివేశారు.

============================

రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిరంతరాయంగా యూరియాను సరఫరా చేస్తున్నామని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 2 వేల 471 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని, 10 రోజుల్లో మరో 500 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు రానున్నదని తెలిపారు. తగిన మోతాదు మేరకు మాత్రమే యూరియాను వినియోగించాలని కలెక్టర్ సూచించారు.

విజయనగరం జిల్లాలో ఎరువులకు కొరత లేదని, అవసరమైన ప్రాంతాలకు సమయానికి సరఫరా చేస్తామని కలెక్టర్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్పష్టం చేశారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని ఆయన ఈ రోజు నిర్వహించారు. 30 మంది రైతులతో కలెక్టర్ నేరుగా మాట్లాడారు. శాస్త్రవేత్తల సూచన మేరకు పంట వేసిన 35–40 రోజుల తరువాత మాత్రమే రెండవ విడత ఎరువులు వేయాలని సూచించారు. ఆ సమయానికి యూరియా అందజేస్తామని, రైతులు ముందుగానే కొనేందుకు రావాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.

============================

విశాఖ రైల్వే స్టేషన్‌కు 'గ్రీన్ రైల్వే స్టేషన్' ప్లాటినం సర్టిఫికేట్ లభించిడం పట్ల రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్, అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సీ.ఎం. రమేష్ హర్షం వ్యక్తం చేశారు. రైల్వే పరిధిలో పర్యావరణ హిత చర్యలు, శుభ్రత, ఆధునిక పారిశుధ్య విధానాలు, నీటి సంరక్షణ, విద్యుత్ ఆదా వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి ఈ ప్రతిష్టాత్మక గుర్తింపుని అందజేస్తారని ఒక ప్రకటనలో తెలిపారు.

విరామం

============================

వస్తు సేవల పన్ను (GST) సంస్కరణల ద్వారా దేశంలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఎంతో మేలు జరుగుతుందని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్ డైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ (CBIC) చైర్మన్ సంజయ్ కుమార్ అగర్వాల్ అన్నారు. GST సంస్కరణల గురించి ఆయన ఆకాశవాణితో మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం అత్యధిక ఎంఎస్ఎంఈలకు ప్రయోజనం చేకూరుస్తుందని చెప్పారు. అదే విధంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

============================

రాష్ట్రంలో కొత్తగా నిర్మించే వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేస్తున్నారంటూ వస్తున్న ప్రచారాన్ని పర్యటక, సాంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేష్ ఒక ప్రకటన ద్వారా ఖండించారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానం ద్వారా నిర్మాణాల్లో వేగం పెరుగుతుందని, నిర్మాణం పూర్తైన అనంతరం కాలేజీలపై నియంత్రణ, యాజమాన్య హక్కు రాష్ట్ర ప్రభుత్వానిదే అని ఆ ప్రకటనలో తెలిపారు. పీపీపీ విధానంలో నిర్మిస్తున్న కొత్త మెడికల్ కాలేజీలతో పాటు ప్రతి మెడికల్ కాలేజీలో కనీసం 150 ఎంబీబీఎస్ సీట్లు అదనంగా పెరిగే అవకాశముందన్నారు. వైద్య విద్య, ఆరోగ్య సేవలను మెరుగుపరచడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఆర్థిక సమస్యలతో మూలనపడ్డ కళాశాలలను పిపిపి విధానంలో నడిపేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు.

============================

పోలవరం ఎడమ కాలువ ద్వారా ఈ సంవత్సరం నవంబర్ నాటికి అనకాపల్లి వరకు గోదావరి జలాలను తీసుకొస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి వెల్లడించారు. విశాఖపట్నంలో ఈరోజు జరిగిన డీఆర్‌సీ సమావేశం అనంతరం మంత్రి మాట్లాడుతూ.. పోలవరం నీటితో తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందన్నారు. నీటి నిల్వలు పెంచేందుకు ట్యాంకుల సామర్థ్యాన్ని పెంచుతామని పేర్కొన్నారు. పలు అభివృద్ధి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేందుకు రెవెన్యూ, కేంద్ర ప్రభుత్వ సంస్థల అధికారులతో సమన్వయ కమిటీ ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. టిడ్కో ఇళ్లు, దీపం-2 పథకం అమల్లో ఇబ్బందులను రాష్ట్రస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని మంత్రి పేర్కొన్నారు.

============================

వాయువ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతం, దక్షిణ ఒడిశా, ఉత్తర కోస్తాంధ్రప్రదేశ్ తీర ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం పేర్కొంది. వీటి ఫలితంగా రాష్ట్రంలో భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్.నారాయణ పేర్కొంటూ…

(వాయిస్ 20 సెకన్లు)

============================

ఆర్చరీ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారత ఆర్చర్లు రెండు పతకాలను సొంతం చేసుకున్నారు. పురుషుల ఈవెంట్‌లో స్వర్ణం దక్కించుకోగా.. మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో రజతం సాధించారు. పురుషుల టీమ్ ఈవెంట్‌లో రిషభ్, ప్రథమేశ్, అమన్‌సైని బృందం ఫైనల్‌లో ఫ్రాన్స్‌పై విజయం సాధించింది. దక్షిణ కొరియాలోని గ్వాంగ్జులో హ్యుందాయ్ అంతర్జాతీయ ఆర్చరీ ఛాంపియన్‌షిప్ లో రజత పతకాన్ని కైవసం చేసుకున్న భారత ఆర్చర్‌లు వెన్నం జ్యోతి సురేఖ, రిషబ్ యాదవ్‌లకు ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఛైర్మన్ ఎ.రవినాయుడు అభినందనలు తెలియజేశారు.

============================
============================